అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి

నవతెలంగాణ-కోటగిరి

అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని ఎత్తొండ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగయ్యకు భార్య లక్ష్మి ఉంది. కాగా.. సంసారం విషయంలో ఇద్దరికీ తరచూ గొడవలు జరిగేవి. ఇదిలా ఉండగా.. సోమవారం ఉదయం నాగయ్య అనుమానస్పదస్థితిలో మృతిచెంది ఉన్నాడు. ఈ విషయం తెలిసిన తన తమ్ముడు అతని అన్నను హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ.. వదిన లక్ష్మి, ఇతరులపై అనుమానం ఉన్నట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



నాగయ్య మృతదేహం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

మంగళవారం | మే 07, 2024 | www.navatelangana.com

ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థినికి సన్మానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని 18వ వార్డుకు చెందిన విద్యార్థిని కే.స్వాతి గత వారం క్రితం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 10/10 జీపీఏ సాధించి ఉత్తీర్ణులైన సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ గంగారం విద్యార్థిని స్వాతిని శాలువాతో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థిని స్వాతి భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో చదివి ఉత్తమ స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రాము, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, రవి శంకర్‌గౌడ్, అశోక్‌గౌడ్, ప్రవీణ్ జాదవ్ నాయక్, చంద్రయ్య, సాగర్, జాకీర్, సుధాకర్, వినయ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న పలువురు

కార్పొరేట్లకు తొత్తులుగా మోడీ ప్రభుత్వం

- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి
- పసుపు బోర్డు పేరుతో ఎంపీ అరవింద్ మోసం చేశాడు
- ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి
- వ్యవసాయ కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

నవతెలంగాణ-ఆర్మూర్

పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని, కార్పొరేట్లకు తొత్తులుగా వ్యవహరించిన మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలని రైతు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో వ్యవసాయ కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. రైతు సమస్యలు పరిష్కరించని బిజెపినీ ఓడించాలని అన్నారు. ఈ సమావేశానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అధ్యక్షత వహించగా.. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్‌రాములు తదితరులు పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేయడానికి దేశంలో మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని అన్నారు. రైతాంగమంతా పెద్ద ఎత్తున 13 నెలల పాటు ఆందోళన నిర్వహించి 750 మంది అమరులై తమ ప్రాణాలను త్యాగం చేసినప్పటికీ మోడీకి కనికరం లేకుండా పోయిందని, ఆ పోరాటాన్ని రైతులు ఆపకుండా చట్టాలు వెనక్కి తీసుకునే వరకు కొనసాగిస్తామని హెచ్చరించడంతో మోడీ సర్కారు వెనక్కి తగ్గి నల్ల చట్టాలను రద్దు చేస్తున్నామని చెప్పి దొంగచాటున అమలు చేస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలను స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయకుండా ఎంఎస్పి మద్దతు గ్యారెంటీ చట్టాన్ని తీసుకురాకుండా రైతులను మోసం చేసిందని అన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ గత ఎన్నికల్లో రైతులకు వంద రోజుల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి రైతులను మోసం చేశారని ఇప్పటివరకు పసుపు బోర్డు ఎక్కడ, ఏమిటి, విధివిధానాలు ఏమీ ప్రకటించకుండా రైతులను మోసం చేశారని అన్నారు. పైగా మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి మరోసారి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారని, వ్యవసాయాన్ని కాపాడుకోవడానికి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి లౌకికతత్వాన్ని కాపాడుకోవడానికి ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డిని గెలిపించాలని వక్తలు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూమన్న, విడగొట్టి సాయిలు, గణేష్, గంగారాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల గోవర్ధన్, ఐఎఫ్‌టీయూ నాయకులు దాసు, సూర్య శివాజీ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

ఉద్యోగులు పోస్టల్ బ్యాలట్ సౌకర్యాన్ని ఈ నెల 8లోగా వినియోగించుకోవాలి

- ఓటరు స్లిప్పులనూ బూత్‌స్థాయి అధికారుల ద్వారా పంపిణీ చేశాం
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఈ నెల 8లోగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం తెలిపారు. ఎన్నికల విధులలో ఉండి ఫారం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యోగి తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని జిల్లాలోని శాఖాధికారులకు సూచించారు. ఉద్యోగులకు కూడా ఎన్నికల సంఘం నుంచి వారి చరవాణికి వచ్చిన సందేశం ఆధారంగా ఆయా నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కామారెడ్డి ఆర్‌డిఓ, మద్నూర్, ఎల్లారెడ్డి తహశీలార్ కార్యాలయాలలో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగుల కోసం ఎన్నికల సంఘం ఈ నెల 8 వరకు కొనసాగిస్తున్న పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఖచ్చితంగా వినియోగించుకోవాలన్నారు. ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం క్లోజ్ అయిన తరువాత పోస్టల్ బ్యాలెట్ వేయడానికి అవకాశముండదని అన్నారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నందున ఈ నెల 3న జరిగే పోలింగ్ రోజు నేరుగా వెళ్ళి ఓటు వేయడానికి అవకాశం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కామారెడ్డిలో 2,167, జుక్కల్‌లో 1,081, ఎల్లారెడ్డిలో 1,298 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

బూత్‌స్థాయి అధికారులతో ఓటరు స్లిప్పుల పంపిణీ..

ఈ నెల 13న జరగనున్న లోకసభ ఎన్నికల సందర్భంగా ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు స్లిప్పులను సంబంధిత బూత్‌స్థాయి అధికారుల ద్వారా పంపిణీ చేశామని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి.పాటిల్ సోమవారం తెలిపారు. ఈ స్లిప్పుల్లో ఓటరు ఏ పోలింగ్ స్టేషన్ నెంబరులో ఉన్నారో లొకేషన్, క్రమ సంఖ్య, పోలింగ్ తేదీ, సమయం వివరాలు స్పష్టంగా పేర్కొనబడ్డాయని ఆయన తెలిపారు. ఈ ఓటరు స్లిప్పులతో పాటు ఓటరు గైడు, సి-విజిల్ కరపత్రాన్ని ప్రతి ఇంటికి అందజేశామని, ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించి ఏదేని సమాచారం, ఫిర్యాదును ఈ యాప్ ద్వారా చేయవచ్చని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నిష్పక్షపాతంగా, స్వచ్ఛందంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేసేందుకు, జిల్లా యంత్రాంగం తగు ఏర్పాట్లు చేస్తున్నదని, సెలవు అని పోలింగ్ రోజు ఎక్కడికి వెళ్లకుండా బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రధానంగా నూతన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని తొలి అనుభూతి పొందాలని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఫోటోతో ఉన్న ఓటరు కార్డ్ లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన మరో 13 రకాల గుర్తింపు కార్డ్‌లో ఏదైనా ఒకదాన్ని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. ఓటర్ ఎపిక్‌కార్డు, ఆధార్‌కార్డు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ కార్డ్, బ్యాంక్, పోస్టాఫీస్ (ఫోటోతో ఉన్నవి) పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, జాతీయ జనాభా రిజిస్టరు జారీచేసిన స్మార్ట్‌కార్డ్, భారత పాస్‌పోర్ట్, పింఛన్ పత్రం, ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఫొటో గుర్తింపుకార్డ్, వికలాంగుల గుర్తింపుకార్డ్, చట్ట సభలలో సభ్యత్వాన్ని చూపే అధికారిక గుర్తింపు కార్డ్‌లలో ఏదో ఒక గుర్తింపుకార్డ్‌ను తీసుకొని పోలింగ్‌స్టేషన్‌కి వెళ్లి ఓటు వేయాలని తెలిపారు. ఈ పార్లమెంటు ఎన్నికలలో పోలింగ్ సమయాన్ని ఎన్నికల సంఘం ఒక గంట పొడగించిందని, ఉదయం 7నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

బయటకు వెళ్లొద్దు

- వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- కరపత్రాలు పంపిణీ



వడదెబ్బ నివారణ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-రెంజల్

జిల్లాలో విపరీతంగా మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ఎవరూ బయటకు వెళ్లవద్దని, అత్యవసర సమయంలో గొడుగులు పట్టుకుని వెళ్లాలని డాక్టర్ సహిస్తా ఫిర్దోష్ స్పష్టం చేశారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలకు, ఆశావర్కర్లకు వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు. వడ దెబ్బ తగిలిన వ్యక్తులకు ప్రథమ చికిత్సలను అందిస్తూ, ద్రవ పదార్థాలను, ఎక్కువగా తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బను నివారిద్దాం, జాగ్రత్తలు పాటిద్దాం అనే నినాదాలతో కరపత్రాలను మదర్ హుడ్ ఆస్పిటల్, ఆరోగ్య చైతన్య వేదిక సంయుక్త సౌజన్యంతో కరపత్రాలు ఆరోగ్య సిబ్బందికి పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని వారు పేర్కొన్నారు. ప్రతి సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆరోగ్య కార్యకర్తలకు ఆదేశించారు. అత్యవసర పరిస్థితులలో వెళ్ళవలసి వస్తే గొడుగు, తెల్లని టోపీలు, నూలు వస్త్రాలను ధరించాలని ఆమె సూచించారు. వడదెబ్బ తగిలిన వ్యక్తులను దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపే రవీందర్, శ్రావణ్ కుమార్, పీహెచ్ఎన్ రాణి, ఆరోగ్య సూపర్‌వైజర్ మాలంబి, ఉజ్మ, లక్ష్మీనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించండి

- ప్రచారం చేసిన సిపిఐ శ్రేణులు



ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో వ్యాపార సముదాయాలకు వెళ్లి జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ కుమార్ శెట్కార్‌ను గెలిపించాలని సిపిఐ ఆధ్వర్యంలో వ్యాపార సముదాయాలకు వెళ్లి సోమవారం ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఐ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్ దుబాస్ రాములు, సిపిఐ కోటగిరి మండల కార్యదర్శి ఎ.విటల్‌గౌడ్ మాట్లాడుతూ.. ఇండియా కూటమిలో సిపిఐ భాగస్వామిగా ఉన్నదని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని వారు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. పదేళ్ల కాలంలో బిజెపి ప్రభుత్వం రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా పరిపాలన చేస్తోందని వారు విమర్శించారు. దేశంలోని 22 మంది బడా పెట్టుబడిదారులకు 10 ఏళ్ల కాలంలో బిజెపి ప్రభుత్వం రూ.16లక్షల కోట్లు మాఫీ చేసిందని వారు తెలిపారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించి ఇండియా కూటమిని అధికారంలోకి తేవాలని వారు తెలిపారు. సిపిఐ కార్యకర్తలు, ప్రజా సంఘాల సభ్యులు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని వారు తెలియజేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో నల్ల గంగాధర్, బుడాల రాములు, గంపల హనుమాన్లు, రాజు, అంజాగౌడ్, సున్నం భరత్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపద కార్పొరేట్లకు

ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించి.. ఇండియా కూటమిని గెలిపించండి

- కాంగ్రెస్‌కు మద్దతుగా సీపీఐ(ఎం) ప్రచారం

నవతెలంగాణ-వర్ని

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పిందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి.. ఇండియా కూటమి తరపున ఎంపీగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సోమవారం మోస్రా మండల కేంద్రంలోని దేశాయి బీడీ సెంటర్‌లో సీపీఐ(ఎం) నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. బీజేపీ కార్పొరేట్ రాజకీయాలకు, దేశ సామాన్య ప్రజల మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ఇండియా కూటమి గెలవాలని ఆయన కోరారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ.. ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, మోస్రా మండల కార్యదర్శి మేకల మల్లేష్, బీడీ ప్యాకర్లు, తదితరులున్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

రైస్‌మిల్లుల యజమానులు కెపాసిటీ మేరకు అన్‌లోడ్ చేసుకోవాలి

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్‌మిల్లుల యజమానులు కెపాసిటీ మేరకు అన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం 38 మంది బాయిల్డ్ మిల్లుల యజమానులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాబోయే రెండురోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్‌మిల్లర్స్ ఎప్పటికప్పుడు దించుకోవాలని సూచించారు. ట్రక్ షీట్లను జారీచేయాలని తెలిపారు. రైస్‌మిల్లర్స్ యజమానులు మాట్లాడుతూ.. మిల్లులో నిల్వ ఉన్న ధాన్యాన్ని గోదాములలో అన్‌లోడ్ చేసేవిధంగా తమకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇన్చార్జి జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నిత్యానంద్, మిల్లుల యజమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బండపల్లి రాజన్న

నవతెలంగాణ-బోధన్

త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీకే ఓటు వేసి గెలిపించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బండపల్లి రాజన్న అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని రైస్‌మిల్లర్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తామని బిజెపి పార్టీ గత పది సంవత్సరాలుగా హామీ ఇచ్చి మోసం చేసిందని అన్నారు. గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన విశ్వరూప మహాసభలో సైతం ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీలిచ్చి మోసం చేశారన్నారు. 2014 ఎన్నికలలో అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేసి పెడతామని హామీ ఇచ్చిన బిజెపి పార్టీ 10 సంవత్సరాలు గడిచిన కూడా ఎస్సీ వర్గీకరణ పట్ల నిర్లక్ష్యం వహించి మాదిగలను మోసం చేసిందన్నారు. ఎమ్మార్పీఎస్ కర్ణాటక తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి మద్దతుగా నిలిచిన కూడా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన రెండు పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకుండా మాదిగలను మోసం చేసిందని, మరొక్కమారు మాదిగల వద్దకు బిజెపి ఓట్లు అడగడానికి వస్తుంది మళ్ళీ అధికారంలోకి వస్తే వర్గీకరణ చేసి పెడతామని మోసపూరితమైనటువంటి హామీతో మాదిగ వాడలోకి రావడం సిగ్గుచేటని ఇకనైనా మాదిగలు మేలుకొని బీజేపీని ఈ ఎన్నికలలో ఓడించాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్ డల్లా సురేష్, బోధన్ నియోజకవర్గ నాయకులు పానుగంటి సాయిలు, గంగాధర్, సాయిలు, శ్రీనివాస్, ఎర్రోళ్ల పోశెట్టి, నడిపి సాయిలు, వెంకటరమణ, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండపల్లి రాజన్న

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల సంక్షేమం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న గిరిజ షెట్కార్

నవతెలంగాణ-దోమకొండ

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీలకు రోజుకు రూ.400 అందిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు, జహీరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ కుమార్తె గిరిజ షెట్కార్ అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఉపాధి హామీ కింద కూలీలను కలిసి ఆమె మాట్లాడారు. ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం రోజువారి కూలీ ఎంత వస్తుందని ఆమె కూలీలను అడిగారు. కాగా తమకు రోజుకు రూ.100 నుండి 120 వరకు కూలీ పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ప్రస్తుత ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజువారిగా రూ.300 చెల్లించాల్సిన అవసరం ఉందని, అయితే 100 నుండి 120 రూపాయల వరకు ఇవ్వడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఉపాధి హామీ కూలీలకు రోజువారి కూలి రూ.400 అందించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆమె హామీనిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో పెట్టిన అన్ని పథకాలను త్వరలోనే అమలు చేస్తుందని చెప్పారు. ఇప్పటికే పలు పథకాలను ప్రవేశపెట్టిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఆగస్టు 15 లోపు 2లక్షల రూపాయల రుణమాఫీని అందిస్తామని చెప్పారు. రాళ్లవానకు నష్టపోయిన రైతులకు రేపటి నుంచి నష్టపరిహారం నేరుగా రైతు ఖాతాలోకి వెళుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జెడ్పిటిసి సభ్యుడు తిరుమల్‌గౌడ్, జిల్లా కార్యదర్శులు అబ్రబోయిన స్వామి, శ్రీకాంత్ రామస్వామిగౌడ్, మాజీ అధ్యక్షుడు నర్సారెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ సభ్యుడు శంకర్ రెడ్డి, సిడిసి మాజీ అధ్యక్షుడు ఐరెని నరసయ్య, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధుసూదన్, నాయకులు పోతుల రాజు, రమేష్, పిన్నెం నాగేంద్ర వర్మ, ఎర్ర కాశీనాథం, ఎంపీటీసీ శంకర్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10న ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేయాలి

- యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇలియాస్



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఇలియాస్

నవతెలంగాణ-కామారెడ్డి

ఈ నెల 10న కామారెడ్డిలో నిర్వహించే ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇలియాస్ తెలిపారు. సోమవారం కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇలియాస్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ.. ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున యువతను తరలించి ప్రియాంకగాంధీ ఇచ్చే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని మన రిజర్వేషన్లను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. యువత తలుచుకుంటే సాధ్యం కానిది ఏది లేదనీ, మోడీ నియంత పాలనను అంతమొందించి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
మంగళవారం | మే 07, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్ పార్టీలో చేరిన దేవాంగ సంఘ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కోటర్మూర్ దేవాంగ సంఘం సభ్యులు బిజెపి పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి సంఘం అధ్యక్షులు వేల్పూర్ రాకేష్, ఉపాధ్యక్షులు గడ్డి కార్తిక్ తదితరులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి సమక్షంలో చేరారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్ మురళి, డేరా మోహన్, మామిడిపల్లి మాజీ సర్పంచ్ మారుతి రెడ్డి, గుపాల భుపెందర్, చిట్టి రెడ్డి, శ్యామ్, బుజ్జి రెడ్డి పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన దేవాంగ సంఘ సభ్యులు

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కొండాపూర్ గ్రామంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కొండాపూర్ గౌడ సంఘంలోని 50మంది సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాకారం రవి, శ్రీధర్, జగన్, గౌస్, చంద్రగౌడ్, సంతోష్, బుచ్చన్న, రాంసింగ్ జీవన్ పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన పలువురు

సీయూల సెకండ్ ర్యాండమైజేషన్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో సోమవారం సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో అదనపు కంట్రోల్ యూనిట్ల రెండవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ర్యాండమైజేషన్ ప్రక్రియలో గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి తరపున ప్రతినిధులు హాజరయ్యారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆర్మూర్, బోధన్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అదనంగా 15 చొప్పున కంట్రోల్ యూనిట్లు, బాల్కొండకు 40, నిజామాబాద్ అర్బన్‌కు 35, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి 20 సీయూలు అదనంగా అందుబాటులో ఉంచడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ అదనపు సీయూలు సెక్టోరల్ అధికారుల వద్ద రిజర్వ్‌లో ఉంచడం జరుగుతుందని అన్నారు. పోలింగ్ సమయంలో ఎక్కడైనా ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే, నిమిషాల వ్యవధిలోనే సెక్టోరల్ అధికారులు సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు చేరుకుని తమ వద్ద రిజర్వ్‌లో ఉండే సీయూలను సమకూరుస్తారని కలెక్టర్ తెలిపారు. కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిన మీదట సాంకేతిక సమస్యలు ఏర్పడిన సీయూల సంఖ్యను బట్టి అదనపు యూనిట్లు కేటాయించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

సేవ చేయడంలో తృప్తి ఉంది

- మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి ముదిరాజ్
- బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఇమ్మడి గోపి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సంపంగి మహేందర్ సర్పల్లి తండా వద్ద ద్విచవాహనంపై వెళ్తూ చెట్టు కు ఢీ కొని మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న ధర్పల్లి మాజీ ఎంపీపీ , ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి ముదిరాజ్ బాధిత కుటుంబానికి తనవంతుగా 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. కుటుంబీకులను పరామర్శించి ఎల్ల వేళల అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమం లో మాజీ ఉప సర్పంచ్ గోదా స్వామి, తోగారి సాయిలు, బొల్లారం చిన్న గంగారాం,ముద్దంగుల రాజమల్లు, కొమ్మురైయ్య, గోగుల సాయిలు, ఒడ్డె బలయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక బీజేపీ, ఆరెస్సెస్, ఎన్డీఏలను ఓడించండి

- సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పిలుపు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

బీజేపీ, ఆరెస్సెస్, ఎన్డీఏ శక్తులను ఓడించాలని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలను పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా దేశ ప్రజలను నిలువు దోపిడీ చేసిందన్నారు. వివిధ ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు అమ్మేసిందన్నారు. వివిధ రాష్ట్రాలు, దేశ ప్రజలు డిమాండ్ చేస్తున్నా కులగణన చేపట్టలేదన్నారు. నల్లధనం వెనక్కి తీసుకొస్తానని, అవినీతిని రూపుమాపుతామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు తెస్తామని హామీలిచ్చిన నరేంద్ర మోడీ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. వాటి గురించి మాట్లాడకుండా దేవుడు, మతం పేరుతో ప్రజల్ని రెచ్చగొట్టడం సిగ్గుచేటన్నారు. బీజేపీ చట్టబద్ధంగా అవినీతిని ప్రోత్సహిస్తూ ఎలక్టోరల్ బాండ్ల పేరుతో వేలకోట్ల ముడుపులను సమకూర్చుకున్నదని ఆరోపించారు. బీజేపీ, ఆరెస్సెస్ శక్తులు మళ్లీ మూడవసారి ఎన్నికల్లో గెలిస్తే దేశంలో ఇక కనీస ప్రజాస్వామ్యం, హక్కులు లేకుండా పోతాయన్నారు. వాటిని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సంధ్యారాణి, పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్ నాయకులు కల్పన, విటల్, లింగం, మోహన్, లలిత, అమూల్య మౌనిక, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు త్వరగా చేపట్టాలి

- ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ సమావేశం మహిళా గ్రామ సంఘం అధ్యక్షురాలు బొల్లం లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కన్వీనర్‌గా వ్యవహరిస్తూ జూన్ 12 కల్లా పాఠశాల మరమ్మత్తులు మౌలిక అవస్థలు అన్ని పూర్తి చేయాలని కమిటీకి సూచించారు. కార్యక్రమంలో ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ వివోఏ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాగిర్యాల్‌లో అగ్ని ప్రమాదం

- మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

మండలంలోని జాగిర్యాల గ్రామంలో 30 నుంచి 40 ఎకరాల వ్యవసాయ భూముల్లో మొదలైన మంటలు గ్రామంలోకి పాకాయి. అగ్ని ప్రమాదంతో స్థానికులు భయందోళనలకు గురయ్యారు. ఇండ్లలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై అ మంటలను ఆర్పాలని ఇంట్లో మోటార్ల సాయంతో ప్రయత్నించారు. ఆ మంటలు తీవ్రస్థాయిలో ఎదురు గాలులు రావడం వల్ల ఆ మంటలకు ప్రజలు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గడ్డివాము, పెంట కుప్ప దగ్ధమైంది. అంతలోనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. ఆ మంటలను ఆర్పే పనిలో అగ్నిమాపక సిబ్బందితోపాటు ఆ గ్రామ యువత కూడా భాగస్వాములయ్యారు.

భాషా పండితులకు సమాన వేతనం అందించాలి

- పిఆర్సీ కమిషనర్ శివశంకర్‌ను కోరిన ఆర్‌యుపిపిటి బృందం
- బీఆర్‌కే భవన్‌లో భేటీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నూతన పిఆర్సిలో భాషా పండితులకు న్యాయం చేయాలని, అప్పర్ ప్రైమరీ, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బోధిస్తున్న భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ వేతనం అందించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్లా నేతృత్వంలోని ప్రధాన కార్యదర్శి గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఘనపురం దేవేందర్, మొహమ్మద్ హమీద్ ఖాన్‌లతో కూడిన బృందం పిఆర్‌సి చైర్మన్ శివ శంకర్‌ను కోరారు. పిఆర్సి కమిషన్ పిలుపుమేరకు కమిషన్ చైర్మన్, సభ్యులను ఆర్‌యూపిపిటి బృందం హైదరాబాదులోని బిఆర్కె భవన్లో సోమవారం కలిసింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు అబ్దుల్లా మాట్లాడుతూ ఇప్పటివరకు కేవలం 150 రూపాయల అదనపు వేతనం ఇస్తూ భాషా పండితులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం భాషా పండితులకు వర్తింపజేయాలని ఆయన కోరారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు మెడికల్ రీఎంబర్స్మెంట్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. 44శాతం ఫిట్మెంట్ సిఫారసు చేయాలని, ఉపాధ్యాయులకు ఇస్తున్న ఆరు ఎర్న్ లీవ్‌లను 15 కు పెంచాలని, చైల్డ్ కేర్ లీవులను 360 కి పెంచాలని ఆయన కోరారు. ఆటోమెటిక్ అడ్వాన్స్మెంట్ స్కీం 5-10-20-25 సంవత్సరాలుగా స్థిరీకరించాలని ఆయన కోరారు. నూతన పిఆర్సి భాషా పండితులకు తప్పనిసరిగా న్యాయం చేస్తుందన్న ఆశాభావాన్ని బృందం వ్యక్తం చేశారు. ఆర్‌యుపిపిటి బృందం వాదనలను విన్న పిఆర్సి కమిషన్ చైర్మన్, సభ్యులు వివరాలు అడిగి తెలుసుకుని సానుకూలంగా స్పందించారని అబ్దుల్లా తెలిపారు.


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌యూపిపిటి బృందం

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ


చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న అంబల్ల శ్రీనివాస్

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో గల గీతా భక్తజనా శ్రమంలో కొనసాగుతున్న వ్యక్తిత్వ వికాస శిబిరంలో ఆశ్రమ అధ్యక్షుడు అంబల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాల బాలికలకు ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున వ్యక్తిత్వ వికాస శిబిరంలో ఉన్న బాల బాలికలకు వడదెబ్బ తగలకుండా ఉండడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీహరి తీర్థ స్వామీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో విశోక తీర్థ స్వామి, పరమేశ్వరి మతాజి, రామకృష్ణ, శేషగిరి, మధు, నర్సయ్య, మనోహర్, బట్టు నర్సయ్య, దినేష్, ఆశ్రమవాసులు తదితరులు పాల్గొన్నారు.

సాయి టెక్నికల్ ఇనిస్టిట్యూట్‌లో యువతకు ఉపాధి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ వెళ్లే దారిలోని క్షత్రియ జూనియర్ కళాశాల ప్రక్కన గల సాయి టెక్నికల్ ఇనిస్టిట్యూట్ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి ఉద్యోగ అవకాశాలతో ఉపాధి చూపిస్తుంది.. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఈ ఇన్స్టిట్యూట్ యందు కంప్యూటర్ బేసిక్, ఎమ్మెస్ ఆఫీస్, డిసిఏ, డిఈఓ, పిజిడిసిఏ, డిటిపి, పేజి మేకర్, ఫోటోషాప్, అటాచ్డ్ తెలుగు టైపింగ్, ఇంటర్నెట్ కంప్యూటర్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. 100శాతం ఉపాధి అవకాశాలు గల కోర్సులను గల్ఫ్ వెళ్లే యువకులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేకంగా టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సులు నేర్పుతూ ప్రముఖుల ప్రశంసలు సైతం పొందుతున్నారు. బేసిక్ టైలరింగ్, బేసిక్ స్టిచింగ్, డెకరేటింగ్ స్టిచ్చింగ్, బేబీ సూట్స్, ఫ్రాక్స్, సల్వార్ కమీజ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ మిర్రర్ వర్క్ 90 రోజుల్లో నేర్పుతున్నారు. పఠనంతో పాటు డివిజన్ పరిధిలోని చుట్టుపక్కల మండలాల్లోని వివిధ గ్రామాల యువతి యువకులు ఎంతో ఉత్సాహంగా, ఆసక్తిగా నేర్చుకునేందుకు ప్రతిరోజు వస్తున్నారు. ముఖ్యంగా వేసవి కాలం సెలవులు ఉండడంతో యువత సమయాన్ని సద్వినియోగం చేసు కుంటు న్నారు. ఉపాధిని సైతం పొందు తున్నారు. 7095473487, 6281510358, 9533677429 నం బర్లకు సంప్ర దించవచ్చని మేనేజ్మెంట్ నిర్వాహకులు సిహెచ్ రమణయ్య తెలిపారు.


శిక్షణ పొందుతున్న యువత



ఉజ్వల భవిష్యత్తుకై...

తమ ఇనిస్టిస్ట్యూట్‌లో శిక్షణ పొందిన యువతి యువకులు ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారు. చదువుకునే విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి.

జక్కుల రాజేందర్ యాదవ్, కరస్పాండెంట్, సాయి టెక్నికల్ ఇనిస్టిట్యూట్, ఆర్మూర్.

చేనేత పద్మ సమైక్య ప్రధాన కార్యదర్శిగా అజయ్

నవతెలంగాణ-మోర్తాడ్

చేనేత పద్మ సమైక్య బాల్కొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మోర్తాడ్ గ్రామానికి చెందిన భోగ అజయ్‌ను నియమించినట్లు తెలిపారు. సోమవారం నిజామా బాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుంట సాయిరాం ఈ నియామక పత్రాన్ని అజయ్‌కి అందజేశారు. పద్మశాలీల ఐక్యత కోసం అహర్నిశలు పాటుపడతానని తెలిపారు. చేనేత అభివృద్ధికి ప్రభుత్వం ఆదుకొని పద్మశాలీల అభివృద్ధికి పాటు పడాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాపల్లి బాలరాజ్, సాయిరాంను భోగా జై సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భోగ సంజీవ్, భోగ సాయి కృష్ణ, సబ్బని సందీప్ తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

మంచిప్ప ప్రాజెక్టును పాత డిజైన్ ప్రకారం నిర్మిస్తాం

- ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం
- కిసాన్‌ఖేత్ జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి

నవతెలంగాణ-విలేకరుల బృందం

మోపాల్ : మండలంలోని మంచిప్ప గ్రామంలో సోమవారం రోజున కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి గారి గెలుపు కొరకు జిల్లా కాంగ్రెస్ కిసాన్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి ఆధ్వర్యంలో మంచిప్ప గ్రామంలోని ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ కేత్ అధ్యక్షులు ముప్ప గంగా రెడ్డి మాట్లాడుతూ.. సకల జనులకు అన్ని సంక్షేమ పథకాలు చేరాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు వచ్చిన 100 రోజుల్లోనే పార్టీ ప్రకటించిన కాంగ్రెస్ గ్యారంటీలు అమలుపరిచారన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి కుటుంబానికి వంద రోజులకు తక్కువ కాకుండా పని కల్పించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కూలీలకు 400 రూపాయలు రోజువారి కూలి తగ్గకుండా అందజేస్తుందన్నారు అదేవిధంగా 500 రూపాయలకే వంటగ్యాస్, ఉచిత రవాణా సౌకర్యం కల్పించిందని తెలిపారు. రైతులకు ఆగస్టు 15లోపే రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట ఇచ్చారని వారు తెలిపారు. మంచిప్ప పరిసర ప్రాంతాలైన బైరాపూర్, అమ్రాబాద్ తాండాలు రీడిజైన్‌తోని భయాందోళనలకు గురవుతున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ ముంపు బాధితులందరికి బాసటగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మంచిప్ప కాళేశ్వరం 21 ప్యాకేజీ పాత డిజైన్ ప్రకారంగా నిర్మించి నిజామాబాద్ రూరల్ ప్రజలందరికీ సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచిప్ప నడి బొడ్డుపైన ప్రకటించారని తెలిపారు. దానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంచిప్ప వేదిక పైననే ప్రజలందరికీ వివరించారని అన్నారు. ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని మన ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోదామని అన్నారు. కార్యక్రమంలో మోపాల్ మండల వైస్ ఎంపీపీ అనిత ప్రతాప్ సింగ్, బ్యాంక్ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, తిరుపతి రెడ్డి, ముత్యం రెడ్డి, సాయిరాం ,రాజేష్ ముదక్ పల్లి మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, మోహన్ రెడ్డి వెంకట్రాం గోవురు భూపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మోపాల్: కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ఆర్మూర్: మున్సిపల్ కౌన్సిలర్, న్యాయవాది సంగీతా ఖాందేష్ ఆధ్వర్యంలో పట్టణం-2వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ చేతి గుర్తుకు ఓటువేసి, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీతా ఖాందేష్ ఇంటిగోడలపై పోస్టర్లు అతికించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, మక్కల సంతోష్, ఖోడే శ్రీనివాస్, సీహెచ్.రమేష్, సాయి రామ్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు .

నందిపేట్: మండలంలోని బాద్గుణ, ఉమ్మెడ, కొండూర్ గ్రామాలలో ఆర్మూర్ ఇంచార్జ్ వినయ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంద మహిపాల్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి ఎంపిగా జీవన్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

జక్రాన్‌పల్లి : మండల కేంద్రంలో కొనసాగుతున్న జాతి ఉపాధి హామీ పనుల వద్దకు కాంగ్రెస్ నాయకులు వెళ్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి కూలీల దినసరి వేతనాన్ని 200 నుంచి 400 వరకు కాంగ్రెస్ పార్టీ పెంచుతుందని తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఇప్పటికే మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం, ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు కాంగ్రెస్ పార్టీ అందిస్తుందని అన్నారు. అదేవిధంగా ప్రతి ఇంటికి రూ.500 సిలిండర్ అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మండలంలోని తొర్లి కొండ గ్రామ పెద్ద చెరువులో నిర్వహిస్తున్న జాతి ఉపాధి హామీ కూలీల వద్దకు కాంగ్రెస్ పార్టీ నాయకులు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుకొని, రాబోయే రోజుల్లో రోజుకి రూ.400 దినసరి కూలి ఇప్పిస్తామని మాట ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో గురించి వివరించారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి జీవన్ రెడ్డిని గెలిపించాలని ఉపాధి హామీ కూలీలను కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నిజాంబాద్ రూరల్ మాల మహనాడు అధ్యక్షుడు జై గంగారం, అంజా గౌడ్ పాల్గొన్నారు.


నందిపేట్‌లో..

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
మంగళవారం | మే 7, 2024 | www.navatelangana.com

సంత్ గోరా కుంబార్ మహరాజ్ వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-పొతంగల్

మండల కేంద్రంలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో సంత్ గోరా కుంబార్ మహరాజ్ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం సాయంత్రం నిర్వహించారు. సంత్ గోర కుంబార్ మహారాజ్ చిత్ర పటంతో భజన మండలి అధ్వర్యంలో ఉరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమం చేసి ముగించారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం అధ్యక్షులు నడిపి సాయిలు, సాయిరాం, సాయిలు, విఠల్, లక్ష్మణ్, రవి, కామప్ప మహరాజ్, దొండిబా మహరాజ్, రామేశ్వర్ మహారాజ్, గాండ్ల సాయిబాబా, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి ఎంపీపీ కాంగ్రెస్‌లోకి..?

నవతెలంగాణ-రామారెడ్డి

మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింహారావు కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన బీఆర్ఎస్ పార్టీ తరఫున ఉమ్మడి మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట నుంచి ఎంపీటీసీగా, మాచారెడ్డి మండల ఎంపీపీగా గెలుపొందారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ సమయంలో కాంగ్రెస్‌లో చేరి, ఎంపీపీగా, భార్య లోయపల్లి అనిత నర్సింగరావు జెడ్పీటీసీగా కొనసాగారు. తిరిగి 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటం, పార్లమెంట్ ఎన్నికల సమయంలో తిరిగి కాంగ్రెస్ గూటికి చేరనునట్లు విశ్వసనీయ సమాచారం.

లింగంపేట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతా

- ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి
- 10 సంవత్సరాలుగా బీజేపీ కేంద్రంలో ఉండి చేసిందేమీ లేదు
- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలాన్ని మోడల్ మండలంగా తీర్చిదిద్దుతానని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ రావు అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మెంగారం, బోనాలు, బానాపూర్, బాయంపల్లి, కోర్పోల్ గ్రామాలలో బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించి మండలాన్ని తీర్చిదిద్దుతానన్నారు. ముఖ్యంగా సెంట్రల్ లైటింగ్ నిర్మాణం పనులు త్వరలో చేపడతామన్నారు. మురికి కాలువలు, సిసి రోడ్లు నిర్మాణం చేపట్టి పల్లెలను ప్రగతి వైపు నడిపిస్తానన్నారు. లింగంపేట్‌లో సర్వేనెంబర్ 983 గత కొన్ని సంవత్సరాలుగా రైతులు భూములు సాగు చేసుకుంటూ ఉంటున్నారని వారికి పట్టాలిప్పించే బాధ్యత నాదని తెలిపారు. ప్రజలకు సేవకునిగా పనిచేస్తానని, కార్యకర్తలకు ఇబ్బంది వచ్చిన వారి వెంటే ఉంటానని వివరించారు. నియోజకవర్గం అభివద్ధి చెందాలంటే లింగంపేట్ మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలంటే జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కరుకు ఓటు వేసి గెలిపించాలని అన్నారు. కేంద్రం నిధులతో రాష్ట్ర నిధులతో మండలాన్ని సుందరీకరిస్తామన్నారు. 10 సంవత్సరంలో దేశంలో బిజెపి పార్టీ అధికారంలో ఉండి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కుల మతాలను రెచ్చగొట్టి గ్రామాల్లో చిచ్చుపెట్టి ఓట్లు దండుకుంటుందని విమర్శించారు. పది సంవత్సరాలు జహీరాబాద్ పార్లమెంట్‌గా పనిచేసిన బిబి పటేల్ నియోజకవర్గాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు ఓట్ల కోసం మాయమాటలు చెబుతున్నారని ఓట్లు అయిన తర్వాత ప్రజలను పట్టించుకోడన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని ఇచ్చిన వాగ్దానం అమలుచేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రజలు గమనించాలని తమ విలువైన ఓటును చేతు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం భవానిపేట గ్రామ సమీపంలోని భామనమ్మ తండాలో భామన్న ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించడంతో అడుగడుగునా మహిళలు, ఓటర్లు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, సర్పంచులు రాజయ్య, రామ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పద్మ నాగరాజు, అఫ్రోజ్, సక్రు, విటల్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు ఎల్లమయ్య, సాయికుమార్, అశోక్, ఫతియోద్దీన్, రాజు, ప్రసాద్‌గౌడ్, నరేష్ సాయిరాం సురేందర్ గౌడ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రెడ్డి

మేజిస్ట్రేట్‌కు ఘన సన్మానం



మేజిస్ట్రేట్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

మేజిస్ట్రేట్‌గా నూతనంగా నియమితులైన శేష సాయితల్పను సోమవారం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఈరడి పోశెట్టి, సంయుక్త కార్యదర్శి వాజీద్ హుస్సేన్, కోశాధికారి శ్రీధర్‌బాబు, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి డాక్టర్ సమ్మయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రాఘవేందర్, న్యాయవాదులు ఎం.గంగారెడ్డి, సిహెచ్‌వి హనుమంతరావు, రాజుపటేల్, మురారి, నరేష్ కులకర్ణి, కాశీంభాష, అజార్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో 2008-09 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్కూల్‌లో చదివినటువంటి పర్మల్ల శెట్టిపల్లి గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి పూలదండ వేసి మెమొంటో అందించి ఘనంగా సన్మానించారు. పాఠశాలతో అలనాటి జ్ఞాపకాలను, అనుబంధాలను నెమరువేసుకున్నారు. పాఠశాలలో అప్పటికి ఇప్పటికీ జరిగిన మార్పులు, అభివృద్ధి గురించి విద్యార్థులతో ఉన్న ఆత్మీయ అనుబంధం గురించి ఉపాధ్యాయులు వివరించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య మాట్లాడుతూ.. సమాజంలో యువత ఆవశ్యకత, నాయకత్వ లక్షణాలు, సహాయ సహకారాలు, స్నేహభావం, కష్టకాలంలో మిత్రులకు తోడుగా ఉండడం గూర్చి సందేశమిచ్చారు. ఈ విద్యార్థుల సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు నవనీత, సోనీ, లావణ్య అనిత సమత, మంజుల, ప్రశాంత్, మహేష్, నరేష్, రవి, రంజిత్ సాయిలు, మహేందర్, శ్రీకాంత్, నారాయణ, సవిన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల వద్ద బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని అంతాపూర్ తండా గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ కూలీల దగ్గరికి వెళ్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాణోత్ నర్సింగి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అనిల్ కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో మండల అధ్యక్షులు గిరి, గ్రామ సీనియర్ నాయకులు రామకృష్ణ, టక్య, మోతీలాల్, కిషోర్, కార్యకర్తలు కూలీలు, తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గం మంథని దేవునిపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కామటి మల్లేష్, సంఘ సభ్యులు, యువకులు బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన సుమారు 40 మంది ఆ పార్టీలకు రాజీనామా చేసి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారికి షబ్బీర్ అలీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు.

తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-మద్నూర్

తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని జుక్కల్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. మండలంలోని సలాబత్పూర్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్నికల తనిఖీ సరిహద్దు చెక్‌పోస్ట్‌ను సోమవారం జహీరాబాద్ పార్లమెంట్ జుక్కల్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వెంట మద్నూర్ తహసీల్దార్ ఎండి ముజీబ్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్న అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్..

పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును జుక్కల్ (ఎస్సీ) అసెంబ్లీ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి తమ ఓటు హక్కును సోమవారం వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల విధులలో నిమగ్నమైన పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల కోసం మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఈనెల 8వ తేదీ వరకు ఈ సౌకర్యం ఉంటుందని ప్రతి ఒక్క ఉద్యోగి తన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందాం

- ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తానాకలాన్, కుర్నాపల్లి, మంగళ్‌పహాడ్, ఎడపల్లి గ్రామాలలో ఆయన జీవన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎడపల్లిలోని వీఆర్‌ఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మంగళ్‌పహాడ్ గ్రామ చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి చేతి గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఆయన కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీ పొంది రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బిజెపి, బీఆర్ఎస్ పాలనపై ప్రజలు అసంతృప్తిలో ఉన్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అటు కేంద్రంలో అత్యధిక మెజార్టీతో గెలుపొందితే బోధన్ ఎన్ఎస్ఎఫ్ కర్మగారాన్ని ప్రారంభించేందుకు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన గుర్తు చేశారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా తానాకాలాన్, కుర్నపల్లి, మంగళ్‌పాడ్ గ్రామాలలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వెంట ఎడపల్లి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రామ్మోహన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈరంటీ లింగం, ఎడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు పోలా మల్కారెడ్డి, మంగళ్‌పాడ్ మాజీ ఎంపిటిసి బుడ్డ విజయలక్ష్మి పోశెట్టి, కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి బొబ్బిలి శ్రీనివాస్, మాజీ సర్పంచులు నాయుడు శంకర్, పొల్డ భాస్కర్‌రెడ్డి, విజయ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం

- కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అభివృద్ధి మొదలైంది
- ప్రతి గ్రామంలో నీటి సమస్యను తీర్చాం
- ఎన్నో ప్రభుత్వ స్కూళ్లలో వసతులు కల్పించాం
- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

నవతెలంగాణ-నిజాంసాగర్

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు అన్నారు. సోమవారం మండలంలోని సుల్తాన్‌నగర్, నిజాంసాగర్, అచ్చంపేట, ఆరేడు, బ్రాహ్మణపల్లి, వెలగనూరు, మంగుళూరు, నర్సింగ్ రావుపల్లి, జక్కాపూర్ మల్లూరు, వడ్డేపల్లి, మాగి, గోర్గల్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఇప్పటివరకు చేసిన అభివృద్ధి గురించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10సంవత్సరాల నుంచి బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఏమాత్రం జుక్కల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కర్‌ను గెలిపించి జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని ఆయన తెలిపారు. కేంద్రంలో కూడా అధికారం చేపడితే మరింతగా నిధులు నియోజకవర్గానికి తీసుకురావొచ్చునని తెలిపారు. ఆగస్టు 15 లోపు కచ్చితంగా రుణమాఫీ చేస్తామని, అందుకు పూర్తి బాధ్యత నాదేనని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జుక్కల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మండలాధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి జయప్రదీప్, భాస్కర్‌రెడ్డి, నాయకులు ప్రజా పండరి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్ బిలోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-2009లో చదివిన పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. తమ పాఠశాలలో జరిగిన విషయాలను నెమరువేసుకుంటూ ప్రస్తుతం వారు తమ విశేషాలను తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. తమకు బోధించిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.

జాప్తి జానకంపల్లిలో బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని జప్తి జాన్కంపల్లి గ్రామంలో సోమవారం బిఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య, జెడ్పిటిసి సభ్యుడు మనోహర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిలు, వంశీగౌడ్, కాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గం గార్గుల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం గ్రామ అధ్యక్షులు సంతోష్, మైనారిటీ సెల్ అధ్యక్షులు యూనుస్, బిఆర్ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఉమారాని, మాజీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, శంకర్ బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి షబ్బీర్ అలీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ అభ్యర్థి సురేష్ షెట్కర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

- పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం



పెద్దకొడప్‌గల్: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి మండలంలోని అంజనీ, శివ్వాపూర్, తలాబ్ తండా, చావ్‌నీ తండాలలో ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి బ్రహ్మరథం పట్టారని, ప్రస్తుతం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటువేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, ఎంపి అభ్యర్థి సురేష్ షెట్కార్‌ల సహకారంతో మన మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. బీజేపీ అభ్యర్థి బిబిపాటిల్ అవకాశవాది అని, పదేండ్లు బిఆర్ఎస్ పార్టీ తరఫున ఎంపిగా ఉండి ప్రజలకు ఎలాంటి సేవచేయలేదని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లప్పపటేల్, నాగిరెడ్డి, శ్యామప్ప, మోహన్, పండరి, సంజీవ్, శ్రీనివాస్, చప్టేనాగు, రషీద్, సాయగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్‌లో గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం

జుక్కల్ : మండలంలోని మాదాపూర్ గ్రామంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను సోమవారం వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో దాదాపుగా అన్ని పూర్తి చేశామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ ఆగస్టు 15 లోపు పూర్తిచేస్తారని మాజీ సర్పంచ్ జల్దేవార్ దినేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీ కాంతారావును ఏ విధంగా అయితే మనం గెలిపించుకున్నామో అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాదాపూర్ మాజీ సర్పంచ్ దినేష్, బాలాజీ పటేల్, బాలు, గంగాధర్, శ్రీకాంత్, అస్పత్వార్ అరుణ్, గాయక్వడ్ విఠల్, లక్ష్మీకాంత్, అనిల్ అస్పత్వార్, పండరి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో 15న అభినందన సభ

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండలంలోని మద్నూర్, డోంగ్లి మండలాల పరిధిలో మున్నూరు కాపు విద్యార్థిని విద్యార్థులు ఇటీవల పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులై 10వ తరగతిలో 9.5 జిపిఏ అంతకంటే ఎక్కువ, అలాగే ఇంటర్ పరీక్షల్లో 950, ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు మున్నూరు కాపు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అభినందన సభ ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు మున్నూరు కాపు కులస్తులు తెలిపారు. సంబంధిత విద్యార్థులు తమ వివరాలు అందజేయాలని మున్నూరు కాపు సంఘం మండలాధ్యక్షులు ఎస్.గంగారాం, గ్రామ అధ్యక్షులు డాక్టర్ బండివార్ విజయ్ పేర్కొన్నారు. వివరాలకు మామిండ్ల అంజయ్య 9949065444, పెట్టిగాడి అంజయ్య 9441631943, నీలం నరసింహులు 9963007364 తదితరులును సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ భద్రతా నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న డీఈ హరిచంద్

నవతెలంగాణ-ఆర్మూర్
విద్యుత్ భద్రతా వారోత్స వాల్లో భాగంగా సోమవారం పట్టణంలో డివిజన్ స్టాఫ్ అందరికీ విద్యుత్ భద్రతా నియమాలు పాటించాలని విద్యుత్ ఉద్యోగులకు అవగాహనా సదస్సు పట్టణంలోని పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యుత్‌శాఖ డిఈ హరిచంద్, టెక్నికల్ డిఈ వెంకటరమణ, ఏడిఈ శ్రీధర్, రాజేశ్వర్ డివిజన్ ఏఈలు పాల్గొన్నారు.

పడకల్‌లో విద్యుత్‌పై అవగాహన


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండలంలోని పడకల్ గ్రామంలో సోమవారం విద్యుత్ శాఖ ఏఈ భాస్కర్ ఆధ్వర్యంలో విద్యుత్తుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా మండలంలో అన్ని గ్రామాలలో విద్యుత్తుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏఈ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి బిజెపిని అస్సలు గెలవనివ్వం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
అవినీతి బిజెపిని అస్సలు గెలవనివ్వం అని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జాతీయ కార్యదర్శి మాజీ ఎంపీ అజీజ్ పాషా, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో నిజామాబాద్ పార్లమెంటరీ సమావేశం పి.సుధాకర్ అధ్యక్షతన స్థానిక రైస్ మిల్ ఫిట్టర్స్ యూనియన్ ఏఐటియుసి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ బోధన్ శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు పి.సుదర్శన్ రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎంపీ అజీజ్ పాషా, అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కామ్రేడ్ పశ్య పద్మ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సిపిఐ నాయకులు కే.భూమయ్య, వై.ఓమయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా సుదర్శన్ రెడ్డి, అజీజ్ పాషా, మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో బిజెపి అవినీతి తారా స్థాయికి చేరిందని సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం సమస్యలు బిజెపికి పట్టడం లేదని అన్నారు. వ్యవసాయ రంగానికి, కార్మిక వర్గానికి బిజెపి చేసింది శూన్యమన్నారు. ఎన్నికల అప్పుడు మాత్రమే బిజెపికి పసుపు బోర్డు, షుగర్ ఫ్యాక్టరీ గుర్తుకొస్తాయని తెలిపారు. బిజెపి 400 సీట్లు వస్తాయని ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతుందని కానీ ఇప్పటికే సౌత్‌లో సాఫ్ట్ అయిందని నార్త్‌లో బిజెపి 100 స్థానాలకు మించి గెలవదని అన్నారు. ఎంపీ అరవింద్ పార్లమెంట్ సభ్యునిగా నిజామాబాద్ జిల్లాకు ఒక్క అభి---వృద్ధి పని కూడా చేయలేదని అన్నారు. అవినీతి మచ్చలేని నాయకుడు పేద ప్రజల ఆశాజ్యోతి అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపునకు సిపిఐ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఏ.రాజేశ్వర్, ఆరేపల్లి సాయిలు, వై.రాజిరెడ్డి, కే రాజన్న, దేవేందర్, కండ్లకోయ గంగాధర్, రఘురాం,రంజిత్, భాగ్యలక్ష్మి అనిల్ కుమార్, ఇమ్రాన్ అలీ, ఫిరోజ్ అలీ, శ్రీనివాస్, సురేష్, మండల కార్యదర్శులు, శాఖ కార్యదర్శులు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

కారల్‌మార్క్స్ ఆశయాలను కొనసాగిస్తాం


కారల్‌మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్
యుగ పురుషుడు కారల్‌మార్క్స్ ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం నాయకులు అన్నారు. 206వ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్ రాములు మాట్లాడుతూ. మార్క్స్ యుగ పురుషుడు ఆయన భార్య జెన్నీ మార్క్ ఆయనకు తోడుగా ఉండి ఆలోచన ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఎదురుకొన్నారన్నారు. కారల్ మార్క్స్ ప్రపంచ మానవాళి మార్పు కోసం పెట్టుబడి గ్రంథాన్ని రచించాడని కొనియాడారు. ఆయన రాసిన పెట్టుబడి ప్రపంచంలో శ్రమ లేనిది ఏది లేదని శ్రమతోను ఏదైనా మార్పు జరుగుతుందని తెలిపారని అన్నారు ఎన్ని కష్టాలైనా ఎదుర్కొని దృఢ సంకల్పంతో గంథాన్ని రచించాడని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం ఏరియా కార్యదర్శి పల్లపు వెంకటేష్, ఇడగట్టి సాయిలు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్లో సీటు పొందిన లోక్షిత్ కన్నా


లోక్షిత్‌ను సన్మానించిన కరస్పాండెంట్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రంలోని విజ్ఞాన జ్యోతి ఉన్నత పాఠశాలలో 5వ తరగతి పూర్తిచేసిన మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన పాలెపు రవికిరణ్ మమతల కుమారుడు లోక్షిత్ కన్నా కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో సీటు సంపాదించాడు. 2024-25 సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సీటు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ గుండోజి దేవేందర్ తెలిపారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో సీటు సాధించిన లోక్షిత్ కన్నాను పాఠశాల యజమాన్య బృందం ఆధ్వర్యంలో అభినందించి, శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. భవిష్యత్తులో బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థిని యాజమాన్య బృందం, ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. కొన్ని రోజుల క్రితం జవహర్ నవోదయలో కూడ సీటు సాధించాడు. రెండింటికి సెలక్ట్ కావడం పట్ల తల్లిదండ్రులు, విజ్ఞాన జ్యోతి స్కూల్ యాజమాన్యం సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సౌమ్య, 5వ తరగతి ఉపాధ్యాయురాలు సరిత, ఇతర ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ


కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల
ఏర్గట్ల పిహెచ్‌సికి చెందిన వైద్యులు సోమవారం ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్, నాగేంద్ర నగర్ గ్రామాలను సందర్శించారు. ఎండలో పనిచేస్తున్న కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిపోర్టింగ్ ఆఫీసర్ ఆకులమారుతి మాట్లాడుతూ... ఉష్ణోగ్రత రోజురోజుకు పెరుగిపోతుందని, ఎండలో పనిచేసే కార్మికులు వడ దెబ్బ తగలకుండ లీటర్ నీటిలో 5 చెంచాల ఓఆర్ఎస్ పౌడర్ కలుపుకుని తాగాలని తెలిపారు. నీడలో మాత్రమే పనిచేస్తూ ధారాళంగా నీటిని తాగాలని కోరారు. వడదెబ్బ తగిలినప్పుడు మనిషికి జ్వరం రావడం, నోరు తడారి పోవడం, కండ్లు మూతలు పడడం, మూత్ర విసర్జన తగ్గిపోవడం జరుగుతుందని అన్నారు. ఇది ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు, వృద్ధులకు, పిల్లలకు, రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారికి తగిలే అవకాశాలున్నాయని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పండరీ, సుమ, కల్పన, శ్యామల, ఆశాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు అంబటి రాజేశ్వర్, మహమ్మద్ రషీద్ బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి కండువాలు కప్పి సునీల్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపుకోసం పాటుపడాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు రాజు, జింక అనిల్, శ్రీను, చిన్నారెడ్డి, జబ్బర్, తదితరులు పాల్గొన్నారు.

మోడీ చెప్పిన పసుపు బోర్డుకు జీవో ఎక్కడ..?

- విధివిధానాలు ఎక్కడ...?
- ఈరవత్రి అనిల్


మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
మోడీ చెప్పిన పసుపు బోర్డుకు జీవో ఎక్కడ...? విధివిధానాలు ఎక్కడ...? అని ఈరవత్రి అనిల్ అన్నారు. కాంగ్రెస్ భవన్ నందు నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ విలేకరుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ అమిత్ షా నిజామాబాద్‌లో నిర్వహించిన సభలో ప్రజలకు ఉపయోగ పడే హామీలు ఇస్తారనుకుంటే పాత అబద్ధలానే మళ్ళీ చెప్పారని అన్నారు. ఐదు సంవత్సరాల క్రితం ఇచ్చిన మాట పసుపు బోర్డు ఏమైందని, మోడీ చెప్పిన పసుపు బోర్డుకు జీవో ఎక్కడ...? విధివిధానాలు ఎక్కడ...? ఇది ప్రజలను దగా చేయడమే అని, అరవింద్ దీనికి సమాధానం చెప్పాలని తెలిపారు. కవితకు నిజామాబాద్ రైతులు గుణపాఠం చెప్పిన విధంగా అబద్దాల అరవింద్‌కు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్తారని అన్నారు. జిల్లా రైతులు ఆత్మాభిమానం కలవారని, అహంకారం గల అరవింద్ ను ఓడించి తీరుతారు అని జోష్యం చెప్పారు. బీడీ కార్మికులకోసం ప్రత్యేక హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల్లో చెప్పి ఏర్పాటు చేయకుండా మళ్ళీ అదే అబద్ధం ఆడుతున్నారని తెలిపారు. షుగర్ ఫ్యాక్టరీ గురించి బిజెపి నాయకులు ఒక్కొక్కరు ఒక్కో మాట మాట్లాడుతున్నారని అన్నారు. అరవింద్ 5సంవత్సరాలగా ఎంపీ ఉండి ఏం చేశారు...? కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి షుగర్ ఫ్యాక్టరీ ఎందుకు ఓపెన్ చేయించలేదని ప్రశ్నించారు. అమిత్ షా మాట్లాడుతూ పక్కన మహరాష్ట్రలో ఉన్న కోపరేటివ్ సొసైటీ ద్వారా ఫ్యాక్టరీ నడిపిస్తమంటున్నారని, కానీ రైతులు ప్రభుత్వమే ఫాక్టరీని నడిపించాలని కోరుతున్నారని, తద్వారా కార్మికులకు స్థిరమైన ఉద్యోగం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మాటకు కట్టుబడి షుగర్ ఫ్యాక్టరీ ఓపెన్ చేయిస్తున్నామని దానికి సంబంధించిన విధివిధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. బ్యాంకుల్లో బకాయిలు చెల్లించడం జరిగిందని, దేశంలో 60 ఫ్యాక్టరీలను మోడీ ప్రభుత్వం అధీనం చేస్కొని నడిపిస్తోందని అరవింద్ మాట్లాడుతున్నాడు, మరి బోధన్ ఫ్యాక్టరీ ఎందుకు అధీనంలోకి తీసుకోలేదని, ఇది అరవింద్ చేతకానితనానికి నిదర్శం అని అన్నారు. బిజెపి మళ్ళీ అధికారంలోకి వచ్చి, రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు తీసేసే కుట్ర చేస్తుందని, బీహార్ ఎన్నికల్లో ఆర్ఎస్ఎస్ వ్యక్తి భగవంత్ రిజర్వేషన్ తీసెయ్యాలని చెప్తే బిజెపి దానికి మద్దతు పలకడం ద్వారా ప్రజలు తిరగబడి బిజెపికి బుద్ధి చెప్పాతారని అన్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు కుల గణన చేయకుండా అడ్డుపడుతున్నారని దానిని కోర్టు వ్యతిరేకించిందని ఆయన తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం


అదృశ్యమైన రాణి

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)
మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన మహిళ ఏడు నెలల బాబును తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఎస్సై కే వినయ్ సోమవారం తెలిపారు.. నిజాంసాగర్‌కు చెందిన చింతల టేకు రాణి (24) భర్త కృష్ణ, ఈమె తన భర్త పిల్లలతో కలిసి 3 నెలల నుండి వెంకటాపూర్ గ్రామంలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు, ఈమె భర్తతో చెప్పకుండా తన 7 నెలల బాబుని తీసుకుని ఇంటి నుండి వెళ్ళిపోయింది. గులాబీ రంగు(పింక్) కలర్ చీర, ఆకుపచ్చ కలర్ జాకెట్ ధరించి ఉందని తెలిపారు. ఎక్కడైనా ఎవరికైనా కనిపిస్తే వెంటనే 8712659862 (ఎస్ఐ-వేల్పూర్) నెంబర్‌కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వైద్యసిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- డిఎంహెచ్ఓ తుకారం రాథోడ్


మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ తుకారం రాథోడ్

నవతెలంగాణ-నవీపేట్
వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని నిజామాబాద్ డిఎంహెచ్ ఓ తుకారం రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని సిహెచ్‌సిని ఆయన సోమవారం పరిశీలించి మాట్లాడారు. వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని గ్రామాల్లో నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలని అన్నారు. వడదెబ్బ తగిలి ఎవరైనా వస్తే ప్రథమ చికిత్స అందించి అవసరం మేరకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి సిఫారసు చేయాలని అన్నారు. ఆశల సమావేశంలో గ్రామాల్లో సాధారణ ప్రసూతుల సంఖ్యను పెంచాలని అలాగే వడదెబ్బ తగలకుండా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్యాధికారిగా మొదటిసారిగా విచ్చేసిన రాథోడ్ తూకారాంను స్థానిక వైద్య సిబ్బంది శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర పిరమిడ్ ధ్యాన మందిరానికి భూమి పూజ



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండలంలోని చింతలూరు గ్రామంలో ధ్యాన దంపతులు శోభ సంతోష్ ఆధ్వర్యంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర పిరమిడ్ ధ్యాన మందిరానికి సోమవారం భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టారు. చింతలూరు గ్రామ అభివృద్ధి కమిటీ వారు పిరమిడ్ ధ్యాన మందిరానికి ఉచితంగా భూమిని కేటాయించారు. పిఎస్ఎస్ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణా రెడ్డి, ప్రధాన సలహాదారులు బొడ్డు దయానంద్ , ప్రధాన కార్యదర్శి డాక్టర్ అమరవాజి శ్రీనివాస్, సభ్యులు సాయినాథ్, రాజు హంస, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు రాకేష్, శంకర్ ధ్యాన బంధువులు పాల్గొన్నారు.

ఫెర్టిలిటీ మెడికల్ క్యాంపు


దాక్టర్ విజయరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేత

నవతెలంగాణ-భీంగల్ రూరల్
భీంగల్ మండల కేంద్రంలో 'అవిరా హాస్పిటల్' హైదరాబాద్ వారి సహకారంతో ఫెర్టిలిటి మెడికల్ క్యాంపు సోమవారం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ విజయ రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాల వల్ల గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. శిబిరాలు నిర్వహించడం. అభినందనీయమని కొనియాడారు. పిల్లలు లేక ఎంతో మంది తల్లిదండ్రులు బాధపడుతున్నారని వారందరూ, దూర ప్రాంతాలకు వెళ్లే స్థోమత లేని వారికి ఇది ఒక సదఅవకాశమని అన్నారు. శిబిరం నిర్వహిస్తున్న సురక్ష పాలి క్లినిక్ డాక్టర్ పడాల పురంధర్‌ను "అవిర హాస్పిటల్" హైదరాబాద్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శిబిరంలో ఇన్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ మొత్తం 22 మందికి వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. క్యాంపు మార్కెటింగ్ మేనేజర్ హరీష్, కౌన్సిలింగ్ శ్రీజ పాల్గొన్నారు. ఇలాంటి ఉచిత ఫెర్టిలిటీ క్యాంపులు ప్రతి నెలలో మొదటి సోమవారం మూడవ సోమవారం నిర్వహించడం జరుగుతుందని "అవిరా హాస్పిటల్" హైదరాబాద్ వారు తెలిపారు. కార్యక్రమంలో సురక్ష పాలి క్లినిక్, ఫార్మసీ డాక్టర్ పడాల పురందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు


డిచ్‌పల్లి: ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరిన పలువురు


బాల్కొండలో...

నవతెలంగాణ-విలేకరులు బృందం
జక్రాన్‌పల్లి : మండలంలోని పలువురు ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ 1 రూపాల గంగారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ చంద్రకళ బాల కిషన్, పుప్పాలపల్లి ఎంపీటీసీ అంకం లక్ష్మీ ప్రకాష్, తాజా మాజీ సర్పంచ్ దావుల గంగు కుమారుడు సంతోష్, జక్రాన్ పల్లి మండల కేంద్రానికి చెందిన తాజా మాజీ వార్డు సభ్యుడు చిట్ల శ్యామ్, బండి సత్యం, బి ఆర్ఎస్ నాయకులు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మోర్తాడ్ : మండలం వడ్యాట్‌పల్లి, శెట్పల్లి గ్రామాలకు చెందిన పలువు నేతలు సోమవారం కాంగ్రెస్లో చేరారు. వడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ తోబాటు రైతు సమన్వయ నేతలు బాల్కొండ నియోజకవర్గం ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. శెట్పెల్లి సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి రాజేశ్వర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామంలో రెండు రజక సంఘలా పెద్ద మనుషులు సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో చేరారు. చేరిన వారందరికీ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మాట్లాడుతూ ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. గ్రామం, సంఘాల అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఉప సర్పంచ్ నవీన్ గౌడ్, గంగామణి ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఇందల్ వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కూరి నవీన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ : మండల కేంద్రానికి చెందిన చెందిన పహిల్వాన్ బ్రదర్స్ మదీనా మజీద్ కాలనీకి చెందిన రంజాన్, అనీస్, హమీద్, రఫీక్, హుస్సేన్, యూసుఫ్, అజీమ్ 50 మందితో కలిసి బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి సునీల్ రెడ్డి సమక్షంలో ప్రజా నిలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.కార్యక్రమంలో బాల్కొండ బూత్ ఇంచార్జి మోహన్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, యూనుస్, మహమ్మద్ అన్వర్, ఇంతియాజ్, షేరు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మోర్తాడ్

మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ బీకాం బీఎస్సీ కోర్సులలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ టీ.పెద్దన్న తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు డిగ్రీ కళాశాలలో ఉచితంగా ఆన్లైన్ సర్వీస్ కల్పిస్తున్నట్లు తెలిపారు. మోర్తాడ్ పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఇంటర్ ఉత్తీర్ణత పొందిన వారు టెన్త్, ఇంటర్ మెమోలు, ఆధార్ కార్డ్ బోనఫైడ్ క్యాస్ట్ ఇన్కమ్ రెండు ఫోటోలతో కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాల కోసం 767500 2734, 9492392028 కు సంప్రదించాలని తెలిపారు.

కమ్మర్‌పల్లిలో బాజిరెడ్డి ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ లోక్ సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆ పార్టీ శ్రేణులతో కలిసి ప్రజలను, చిరు వ్యాపారులను, టీ షాపులలోకి వెళ్లి ప్రచారం నిర్వహించారు. అందరితో కలివిడిగా కరచాలనం చేస్తూ కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. చిరు వ్యాపారులతో వ్యాపారం ఎలా నడుస్తుంది, వ్యాపారంలో ఉన్న ఇబ్బందులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు కోరిక మేరకు ఆయన ఫోటోలు, సెల్ఫీలు దిగారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, పార్టీ రాష్ట్ర నాయకులు రాజారామ్ యాదవ్, బద్దం చిన్నారెడ్డి, జడ్పిటిసి బాజిరెడ్డి జగన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో

మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

ఈ నెల 13 న పార్లమెంటు ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. పోలింగ్ నిర్వహణకు ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉండేలా ముందస్తుగానే ఏర్పాట్లను సరిచేసుకోవాలని హితవు పలికారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లపై కలెక్టర్ సోమవారం సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ ను అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ కేద్రాలలో ఓటర్ల కోసం నీడను అందించేలా టెంట్లు, షామియానాలు వేయించాలని, పోలింగ్ కేంద్రం బయట విధులు నిర్వర్తించే బీఎల్ఓలు, వాలంటీర్లు, ఆశ వర్కర్లకు కూడా టెంట్ ఉండేలా చూసుకోవాలన్నారు. ఎక్కడ కూడా ఏ ఒక్క ఓటరు కానీ, పోలింగ్ నిర్వహణ విధులు నిర్వర్తించే సిబ్బంది ఎవరు కూడా వడదెబ్బ బారిన పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. క్యూ లైన్లలో నిల్చునే ఓటర్లకు తప్పనిసరిగా నీడ ఉండేలా ప్రణాళికాబద్ధంగా టెంట్లు ఏర్పాటు చేయించాలన్నారు. విద్యుత్ వసతి, ఫ్యాన్లు, లైట్లు పనిచేస్తున్నాయా లేదా పరిశీలించాలన్నారు. సౌకర్యాల కొరత ఉంటే తక్షణమే పనులు జరిపించాలని, అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. సదుపాయాల లేమితో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని పోలింగ్ సిబ్బంది నుండి ఫిర్యాదులు రాకూడదని సూచించారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన టేబుళ్లు, ఇతర సామాగ్రి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలతో పాటు, పరిసర ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎక్కడైనా పిచ్చి మొక్కలు, పొదలు పెరిగితే వాటిని తొలగింపజేయాలని సూచించారు. ఎంపిడిఓలు, ఎంపిఓలు, పంచాయతీల కార్యదర్శులు పరస్పర సమన్వయంతో పని చేయాలని హితవు పలికారు. టాయిలెట్ లు శుభ్రం చేయించి, నీటి వసతితో వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పీఎస్ లో ర్యాంపులు, వీల్ ఛైర్లు సరి చూసుకోవాలని, చివరి నిమిషంలో హడావుడి పడకుండా ముందుగానే ఏర్పాట్లను చక్కబెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాలలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ మంగళవారం నాటితో వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయమై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. కాగా, మోడల్ పోలింగ్ కేంద్రాలను ఆకట్టుకునేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, సందేశాత్మకంగా ఏర్పాట్లు ఉండాలని హితవు పలికారు. ఎక్కడ కూడా ఏ చిన్న ఇబ్బంది తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. సెల్ కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



చక్కెర కర్మాగారం ప్రారంభించుడు నీ వంతు.. రైల్వే ఆర్ఓబీ చేసుడు నావంతు

- ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్

బోధన్‌లో చక్కెర కర్మాగారం ప్రారంభించడం సుదర్శన్ రెడ్డి వంతు నవీపేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించడం తనవంతని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నిర్వహించిన రోడ్ షో లో జీవన్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి హోంశాఖ మంత్రి అమిత్ షా బోధన్ చక్కెర కర్మాగారం ప్రారంభించడం రైతులదే బాధ్యత అని చెప్పడం బిజెపికి రైతుల సంక్షేమంపై ఉన్న నిర్లక్ష్య వైఖరి కనబడుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుల సంక్షేమం కోసం చక్కెర కర్మాగారాన్ని ప్రారంభించేందుకు 43కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. విలాసవంతంగా జీవించేందుకు అలవాటు పడ్డ అరవింద్ ఐదేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదని కాబట్టి ప్రజలు ఓడించి బుద్ధి చెప్పాలని అన్నారు. గతంలో ఎంపీగా చేసిన కవిత చక్కెర కర్మాగారం తెరిపిస్తానని చెప్పి కారాగారానికి వెళ్లిందని విమర్శించారు. ఆగస్టు 15 తేదీలోగా 2 లక్షల రుణమాఫీ, గృహలక్ష్మి, ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామని అన్నారు. అపార అనుభవం కలిగిన జీవన్ రెడ్డిని తనకు తోడుగా గెలిపించి పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ కుమార్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, నవీన్ రాజ్, మూసా, జబీర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికిన ప్రజలు

- మంగళ హారతులు, పూలతో స్వాగతం
- బస్సులో నుంచి అభివాదం చేసిన కేసీఆర్



కమ్మర్‌పల్లి : స్వాగతం పలుకుతున్న బాజిరెడ్డి, నాయకులు



ఆర్మూర్: అభివాదం చేస్తున్న కేసీఆర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నిజామాబాద్ పార్లమెంటు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కు మద్దతుగా జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీ, స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో పాల్గొనేందుకు విచ్చేసిన బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మండల కేంద్రంలో ఆ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి నుండి నిజామాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన కేసీఆర్ బస్సు యాత్రకు జిల్లా సరిహద్దులోని గండి హనుమాన్ వద్ద ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడినుండి మండల కేంద్రంలోకి ప్రవేశించిన కేసీఆర్ బస్సు స్థానిక బస్టాండ్ కూడలిలో కొద్దిసేపు నిలిపారు. దారి పొడవునా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కేసీఆర్ బస్సు పైకి పూల వర్షం కురిపించారు. తనకు ఘన స్వాగతం పలికిన మహిళలకు, పార్టీ శ్రేణులకు బస్సులో నుండే కేసీఆర్ అభివాదం చేశారు. మండల కేంద్రంలో మెట్ పల్లి వైపు ప్రారంభం నుండి మోర్తాడ్ వైపు ముగింపు వరకు ఆ పార్టీ శ్రేణుల నినాదాలతో కమ్మర్ పల్లి మారుమోగింది. కేసిఆర్ బస్సు యాత్ర కాన్వాయ్ వెంట కలిసి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తరలి వెళ్లారు.

ఆర్మూర్ :లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ రోడ్ షో కు వెళ్తూ మార్గమధ్యంలో పెర్కిట్ చౌరస్తా వద్ద తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కు సోమవారం రాత్రి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి , సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ షో

- మాజీ ఎమ్మెల్సీ అరికల నర్సారెడ్డి

నవతెలంగాణ ఆర్మూర్



మాట్లాడుతున్న అరికల నర్సారెడ్డి

రేపు ఆర్మూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ షో ఉందని , కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటి పర్తి జీవన్ రెడ్డిని లక్ష మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ అరికల నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వినయ్ కుమార్ రెడ్డి సోమవారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రేపు 8న తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ఆర్మూర్‌లో రోడ్ షో, కార్నర్ మీటింగ్‌కు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు మామిడిపల్లి చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు జరిగే రోడ్ షోకు ప్రజలు, రైతులు, మహిళలు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిపిసి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరవుతున్నట్లు తెలిపారు. గతంలో సీఎం కేసీఆర్ కూతురు కవితను ఓడించినట్లే, ఎంపీ అరవింద్ ను ఈ ఎన్నికల్లో ప్రజలే ఓడిస్తారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి పార్లమెంట్‌కు పంపే విధంగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త బూతు స్థాయిలో పనిచేయాలని వారన్నారు. కార్యక్రమంలో నాయకులు మార చంద్రమోహన్, ఎంపీపీ పస్కా నరసయ్య ,ఇట్టెం జీవన్ ,సాయిబాబా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి సన్మానం



పలువురు సన్మానిస్తున్న రక్ష స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది ఖాందేశ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి సామాజిక అంశాలలో సేవలందిస్తున్న సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. సత్కరించిన వారిలో విద్యా ప్రవీణ్ పవార్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా ఇటీవల నియమించబడినారు. పట్వారి విద్యా గోపికృష్ణ మరియు పట్వారి తులసి ఇద్దరు అపూర్వ సోదరులు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సంస్థకు ఒకరు అధ్యక్షులుగా మరొకరు ప్రధాన కార్యదర్శిగా ఉంటూ విశిష్ట సేవలు అందిస్తున్నారు. మీర శ్రావణ్ ఆర్మూర్ మీ సేవ అసోసియేషన్ మండల అధ్యక్షులుగా నూతనంగా ఎన్నుకోబడిన సందర్భంగా ఈ నలుగురి సేవల్ని ప్రశంస్తూ అభినందిస్తూ వీరి సేవలు ఇలాగే కొనసాగించాలని శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి గోనె శ్రీధర్, ఉపాధ్యక్షులు జింధం నరహరి, శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బేతు గంగాధర్, ఖాందేష్ సత్యం కార్యదర్శులు మక్కల సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి రూ.400 అందిస్తాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీందరికి రూ.400 కూలి కాంగ్రెస్ అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంతోష్ రెడ్డి అన్నారు. సోమవారం ఇందల్ వాయి మండలంలోని పలు తండాల్లో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ మెనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపించాలని అన్నారు. ఎంపీ అర్వింద్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ఎన్నికల కోడ్ ముగియగానే కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ స్కీంలను అర్హులందరికి అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో మాదిరిగానే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలందరికి న్యాయం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ కోరట్ పల్లి అనంద్, మాజీ ఉప సర్పంచ్ బైరయ్య, నారాయణ, సిహెచ్ దాస్, సుధాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కేసీఆర్ సభలో బంగారం గొలుసు చోరీ

- బీఆర్ఎస్ కార్యకర్త ఆవేదన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



గొలుసు పోగొట్టుకున్న కార్యకర్త

నిజామాబాద్ నగరంలోని గాంధీ చౌక్‌లో సోమవారం జరిగిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభలో కార్యకర్త బంగారం చోరీకి గురైంది. డిచ్‌పల్లి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గోపు శ్రీకాంత్ సభకు వచ్చారు. ఆయన తులం 50 గ్రాముల బంగారం గొలుసు పోవడంతో షాక్‌కు గురి అయ్యాడు.

ప్రమాదవశాత్తు

చెరువులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని బోర్గం(కె) చెరువులో కాలు జారిపడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. నిజమాబాద్ నగరంలోని నాందేవాడలో గల సంజీవయ్య కాలోనికి చెందిన హనుమంతే విశాల్ బాబు (24) . బంటు శక్తి, ఆర్మూర్ నరేష్ కలసి ఆదివారం బోర్గం దగ్గర ఉన్న చెరువు వద్ద మద్యం సేవించారు. అనంతరం చెరువులో కాళ్లు, చేతులు కడుక్కునే క్రమంలో విశాల్ బాబు ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయాడు. అయన్ను కాపాడేందుకు బంటు శక్తి, ఆర్మూర్ నరేష్ చెరువులోకి దిగారు. వాళ్ళు కూడా మునిగిపోయే క్రమంలో బంటు శక్తి ఆర్మూర్ నరేష్ లను స్తానికులు చూసి బయటకి తీశారు. విశాల్ బాబు అప్పటికే నీటిలో మునిగి ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం పోలీసుల గజ ఈతగాళ్లను దించి గాలించగా మృతదేహం లభ్యమైంది. విశాల్ బాబు తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.

అక్కలారా.. అవ్వలారా ఎంపీగా ఆశీర్వదించండి

- అభివృద్ధి చేయాలన్న.. సంక్షేమ పథకాలు అందించాలన్నా కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం
- కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుంది
- నిజామాబాద్ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి జీవన్‌రెడ్డి
- భీంగల్, బడా భీంగల్‌లో కార్నర్ మీటింగ్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఆశీర్వదించండి.. ఎంపీగా గెలిపించండి..చివరి శ్వాస వరకు ప్రజా సేవ చేసే అవకాశం కల్పించండి.. అని జీవన్ రెడ్డి అభ్యర్థించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని నిజామాబాద్ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. భీంగల్, బడా భీంగల్‌లో సోమవారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇస్తున్నారా అని ప్రశ్నించారు. పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని, గతంలో అందని పెన్షన్, సంక్షేమ పథకాలు అర్హులైన వారికి కాంగ్రెస్ అందిస్తుందని, అర్హులైనా సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు సేకరించి ఇంటింటా అందిస్తామని తెలిపారు. 2014 తర్వాత పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులకు అంక్షలు లేకుండా పెన్షన్ ఇస్తామని అన్నారు. వ్యవసాయ పెట్టుబడి వ్యయం పెరిగిందని, పదేళ్ల కాలంలో కేంద్రంలో బీజేపీ గానీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గానీ గల్ఫ్ కార్మికులను ఆదుకోలేదని, గల్ఫ్‌లో మృతి చెందిన కుటుంబాలకు రు.5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎవరికైనా కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందా..అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల లేని నిరుపేదలకు రు.5 లక్షలు మంజూరు చేస్తుందని, వచ్చే ఖరీఫ్ పంట నాటికి రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని అన్నారు. కేసీఆర్ పెద్ద కొడుకు అని చెప్పుకున్న ప్రశాంత్‌రెడ్డి 21 ప్యాకేజీ పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. ఎంపిగా గెలిచిన తర్వాత ఏడాదిలో 21 ప్యాకేజీ పూర్తి చేసి నీరు అందిస్తామని, భీంగల్ బస్ స్టేషన్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. బాల్కొండ నియోజక వర్గం ఇంచార్జీ ముత్యాల సునిల్ కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గంజాయి కట్టడిలో విఫలమై యువకులను బానిసలను చేసిందని అన్నారు. కరెంటు ఇవ్వరని..పెన్షన్లు బందు చేస్తారని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌ను బద్నాం చేశారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, భీంగల్ అభివృద్ధి కోసం కృషి చేస్తామని చెప్పారు. జీవన్ రెడ్డిని గెలిపిస్తే కేంద్రంలో మంత్రి అవుతారని.. మరిన్ని నిధులు తీసుకు వచ్చి అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీవన్‌రెడ్డి ప్రజలకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డిని ఎంపీగా గెలిపించి, తనకు బలం ఇవ్వాలని సునీల్ కుమార్ వేడుకున్నారు.



కేసీఆర్ రోడ్‌షోకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



జక్రాన్‌పల్లి : కేసీఆర్ సభకు వస్తున్న నాయకులు, కార్యకర్తలు

నవతెలంగాణ-విలేకరులు

కమ్మర్‌పల్లి:నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్డు షోకు మండలంలోని ఆయా గ్రామాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ప్రైవేటు స్కూలు బస్సుల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు తరలి వెళ్లారు. జిల్లా కేంద్రంలో నిజామాబాద్ లోక్ సభ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా కేసీఆర్ రోడ్ షో నిర్వహించారు.

ముప్కాల్:తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా కేంద్రంలో తలపెట్టిన భారీ రోడ్‌షోకు మండలం నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు వందల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన బస్సుల్లో బయల్దేరి వెళ్లారు. మండలంలోని రెంజర్ల, కొత్తపల్లి, వేంపల్లి, వెంచిర్యాల, నాగంపేట్, నల్లూర్ గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు వెళ్లారు. భారీ రోడ్ షో అనంతరం నేరుగా గాంధీ చౌక్ వద్ద గల నెహ్రూ పార్కులో ఏర్పాట్లు చేసిన కార్నర్ మీటింగ్ లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, మాజీ సర్పంచులు ఆకుల రాజారెడ్డి, మట్ట సందీప్, మారెల్లి విష్ణు, ఎంపీటీసీ సభ్యులు జోషి వెంకట్ రాజ్, సత్యనారాయణ, మోహన్ రెడ్డి, కో అప్షన్ సభ్యులు మునిరోద్దీన్, మాజీ ఉప సర్పంచులు మగ్గిడి మోహన్ రెడ్డి, బ్రమ్మదండి సువర్ణ-లింగం, ప్రధాన కార్యదర్శి జోషి ఉమ శంకర్, శ్రీనివాస్ గౌడ్, కొమ్ముల మోహన్ రెడ్డి, టి.సాయన్న, రఫీ, ముఖీదు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి :మండలంలోని పలు గ్రామాల నుంచి గ్రామానికి రెండు బస్సుల చొప్పున బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు సభకు మహిళలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర రావు హాజరు కావడంతో మండలంలోని అన్ని గ్రామాల నుంచి బస్సుల ద్వారా మహిళలు రైతులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఎంపీపీ కుంచాల విమల అన్ని గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలించారు.

జిల్లా కేంద్రంలో నిర్వహించే కెసిఆర్ సభకు మండలంలోని మునిపల్లి గ్రామం నుంచి మహిళలు రైతులు తరలి వెళ్లినట్టు మండల వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి కూలి ప్యాక్ సాయి రెడ్డి తెలిపారు. నిజాంబాద్ పార్లమెంటు టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కొరకు భారీ బహిరంగ సభకు వస్తున్నటువంటి కేసిఆర్ సభకు గ్రామము నుంచి రెండు బస్సుల నుంచి బయలుదేరినట్టు తెలిపారు.

నిజామాబాద్‌రూరల్ :బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిజామాబాద్‌లో నిర్వహిస్తున్న రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌కు నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ తండా గ్రామం నుండిమలా తరలివెళ్లారు. ఎంపీపీ, మాజీ ఎంపీటీసీ, గ్రామ శాఖ అధ్యక్షుల ఆధ్వర్యంలో నిజామాబాద్ మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామం నుండి రైతులు, యువకులు పెద్ద ఎత్తున సభకు వెళ్లారు



ముప్కాల్: రెంజర్ల నుండి వెళ్తున్న నాయకులు



నిజామాబాద్‌రూరల్ :మల్కాపూర్ తండానుండి తరలిన నాయకులు